# చివరి మేకు

అరగంట నుండి బాలరాజు బస్‌స్టాప్‌లో నిలబడినా బంజారా హిల్స్ వెళ్లే బస్సు ఏదీ రాకపోతుండేసరికి విసుగు ఎక్కువకాసాగింది. ఎండ చిక్కగా ఉంది, చెమట పడుతూ చిరాకుగా ఉంది. అతను చదువుకునే రోజుల్లో సిటీబస్సుల్లోనే ప్రయాణం చేశాడు. ఎన్నో సంవత్సరాల తర్వాత మళ్లీ ఆవేళ బస్సు కోసం ఎదురుచూడసాగాడు. కార్లలో ప్రయాణం చేయడం చాలాకాలం అలవాటయినాక సిటీబస్సుల మీద పూర్తి అయిష్టత ఏర్పడింది. 'అంతమంది ఇరుక్కుని ఎలా ప్రయాణిస్తుంటారు?' అని చాలాసార్లు అనుకున్నాడు. అతను పాత విషయాలను ఎప్పుడో మర్చిపోయాడు. కొత్త అంటే పరుగెడుతుంటాడు. అనుకోకుండా జీవితంలో చాలా కలిసి వచ్చింది. ఉన్నపళంగా చాలా ఎత్తుకు ఎదిగాడు. అక్కడే నిలబడడం కష్టమయింది.

రెండు ఆటోలు, ఒకదాని వెనక మరొకటి వచ్చి పక్కనే ఆగాయి. ఆటోలో వెళ్దామనిపించింది. వెళ్లేందుకు డబ్బులు లేవు. ఇంటిక వెళ్లాక ఇవ్వాలంటే వసుమతిని అడగాలి. మునుపు ఎంత అడిగితే అంతకు ఎక్కువే ఇచ్చేది. ఇప్పుడు ఇవ్వడం లేదు. ఆమె దగ్గర ఉండవని కాదు. ఇవ్వదు. అంతే. భార్యతో నెగ్గుకు రాలేకపోతున్నాడు. ఈ మధ్య కోపం ఎక్కువయిపోతోంది. తట్టుకోవడం కష్టమవుతోంది.

సంవత్సరం కిందటి వరకు అతనికి రెండు కార్లు ఉండేవి. ఎంతో ఖరీదయినవి. ఫైనాన్సు వాళ్ల బాధపడలేక ఒక కారు తక్కువ ధరకే అమ్మేశాడు. ఆ కారు వసుమతి ముచ్చటపడి కొనుక్కుంది. ఆమెకు తెలియకుండా అమ్మేసేయాలసి వచ్చింది. డీల్ సత్తిరెడ్డి చేశాడు. అమ్మిన తర్వాత వసుమతి చాలా గొడవ చేసి పదిరోజులపాటు మాట్లాడను కూడా మాట్లాడలేదు. రెండో కారు గేరేజ్‌లో ఉంది. బాగు చేయడానికి

ఇచ్చి రెండు వారాలవుతోంది. ఫోను చేసి అడుగుతోంటే అదో ఇదో అంటున్నాడు కాని తీసుకొచ్చి ఇవ్వడం లేదు. గేరేజ్ వాడిని ఏమనాలో అర్థం కావడం లేదు.

మరో పావుగంట సేపు బస్సు కోసం ఎదురు చూసి విసుగు భరించలేక ఇంటి వయిపు నడవడం మొదలెట్టాడు. నడవడం ఇబ్బంది కాదు. కొద్దిరోజుల కిందటి వరకు కార్లలో దర్జాగా తిరిగిన మనిషి ఇలా నడుస్తూ వెళ్లడం తెలిసిన వాళ్లు ఎవరు చూసినా నామోషిగా ఉంటుంది. బస్‌స్టాపు దాటి కొద్ది దూరం నడిచాడో లేదో బంజారాహిల్స్ వయిపు వెళ్లే బస్సులు ఒక దాని వెనక మరొకటి-నాలుగు బస్సులు వెళ్ళిపోయాయి. అన్నీ ఖాళీగానే ఉన్నాయి. బాలరాజు చేతులెత్తి ఆపేందుకు ప్రయత్నం చేశాడు. ఏదీ ఆగలేదు. తిరిగి నడక సాగిస్తూ గేరేజ్ వాడిని తిట్టుకున్నాడు. వాడు తన కారును బాగుచేసి ఇచ్చి ఉంటే తనకు ఈ నడిచే బాధ తప్పి ఉండేది. ఇంటికి వెళ్లే దారిలోనే గేరేజ్ ఉంది. వెళ్లి తన కారు విషయమయి తెలుసుకోవాలని అనుకున్నాడు.

పది నిమిషాలు గడిచాక గేరేజ్ చేరుకున్నాడు. ఎప్పుడూ రణగొణ ధ్వనులతో నిండి ఉండే గేరేజ్ ఏ కారో చనిపోయి నట్టు నిశ్శబ్దంగా ఉంది. ఎవరూ కనబడలేదు.

“హలో” పెద్దగా అన్నాడు.

మూల ఉన్న పాతకారు వెనక నుండి మెకానిక్ తల బయటకు వచ్చి, “ఏం కావాలి సారూ?” అడిగింది.

తన కారు కోసం కలయచూస్తూ, “నా కారు రా” అన్నాడు.

“అదో ఆ చెట్టు కింద ఉంది. బాగు కాలే”.

“ఇచ్చి చాలా రోజులయింది. ఇంకెంత కాలం ఉంచుకుంటార్రా?”

“పాత బాకీ ఎనిమిది వేల వరకు ఇవ్వాలటగా?”

“ఇచ్చే వరకు చేయరేమిటి? ఏడి మీ శేర్?”

“దావత్‌కు వెళ్లాడు. సాయంత్రం వచ్చి ఆయనతో మాట్లాడకూడదూ?”

సాయంత్రం వచ్చినా ఉండడు. ఉన్నా మందులో ఉంటాడు. బాలరాజు వెనక్కి తిరిగాడు. ఇంకెన్ని రోజులు డబ్బులకోసం తడుముకోవలసి వస్తుందో అర్థం కావడంలేదు.

“మీ కంపెనీ ఎత్తేశారట. నిజమేనా సారూ?”

వాడి మాట  విననట్టు బయటకు వచ్చాడు. తన సంగతి చాలా మందికి తెలిసిపోయి ఉంటుంది. పంపకాలు అయిపోయినా తన వాళ్ల దగ్గర నుండి ఎటువంటి సహాయం అందుతుందని  అనుకోవడం లేదు. ఎవరి కష్టాలలోనూ తను చేయూత నివ్వలేదు. తనను ఎవరు ఎందుకు ఆదుకుంటారు? వసుమతి దగ్గర కొద్దగోప్పో ఉండకపోవు. వాళ్ల దగ్గర బంధువులు బాగా డబ్బున్న వాళ్లు. రాజకీయంగా కూడా పలుకుబడి ఉన్న వ్యక్తులు.  తను ఎదగడానికి వాళ్ల వాళ్లంతా ఎంతో కొంత సహాయం చేశారు. నాలుగయిదు కోట్ల వరకు ఆమె తరుపు వాళ్లకు బాకీ ఉన్నాడు. అవి ఎలా తీరతాయో తెలియడం లేదు. ఎన్ని ఎకరాలు కొన్నా ఇంకా కొనాలనిపించేది. ఇప్పటికి ఇహ చాలు అనుకుని ఎక్కడో ఒకచోట ఆగిపోయి ఉంటే బావుండేది. సత్తిరెడ్డి మాటలు విని సినిమా పంపిణీలో కూడా పెట్టాడు. అప్పట్లో "మైదాసు" లా పట్టుకుందల్లా బంగారమయింది. ఒకటికి నాలుగు రెట్లు లాభాలు వచ్చాయి. ఆరోజులు మళ్లీ ఎప్పుడు వస్తాయో? బూమ్ తగ్గడంతో కింద పడ్డాడు. లేవడం తేలిక కాలేదు. సినిమాలు ఫట్ మన్నాయి. అక్కడా దెబ్బతిన్నాడు. కోలుకోవడం కష్టమవుతోంది.

పచ్చి ఎండలో అరగంట నడిచాకగాని ఇంటికిచేరుకోలేక పోయాడు. వీధి తలుపు తెరిచే ఉంది. ఆరు నెలల కిందటి వరకు ఇంటికి  కాపలాదారుడు ఉండేవాడు. అతని ప్రవర్తన నచ్చక తనే తీసేశాడు. ఇంట్లో అతని చనువు ఎక్కువ అవుతుండడం ఇష్టం లేకపోయింది. కుక్కల్ని చూసుకోడానికి ఎవరూ లేకపోవడంతో వసుమతి ఎవరికిచ్చిందో తెలియదు. అడగాలని పించలేదు. పనిమనిషి, వంటమనిషులున్నారు. ఎంతకాలం పనిలో ఉంటారో తెలియదు. రెండు నెలల నుండి వాళ్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నాడు. మంచి ఇల్లు దొరికాక వెళ్లిపోతారేమో తెలియదు.

చాలా దూరం నడవటాన చెమట పట్టి చొక్కా తడిచి వంటికి అతుక్కుపోతోంది. గదిలో ఎ.సి. ఉంది. వేయాలనిపించలేదు. ఫేను వేసి సోఫాలో కూర్చుని వసుమతి కోసం చూశాడు. కనబడలేదు.  మధ్యగది నుండి ఆమె పడక గది కనబడుతోంది. అక్కడా ఉన్నట్టు లేదు. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. తను కొన్నప్పుడు ఆ ఇల్లు పన్నెండు లక్షలకు వచ్చింది. అప్పట్లో అదే ఎక్కువ. ఇప్పుడు మూడు కోట్లకు తక్కువ ఉండదు. తను అమ్ముకోడానికి వీలులేదు. తాకట్టులోంచి కోర్టుకెళ్లింది. తను పెట్టుకున్న

లాయరును అవతలివాళ్లు కొనుక్కున్నట్టు అనిపిస్తోంది. ఏమాటా నిజం చెబుతున్నట్టు అనిపించదు. ఏమీ లేనప్పుడు తనెంత ఆనందంగా ఉన్నాడు?"

"వసూ" పిలిచాడు.

వంటగదిలో ఉన్న వసుమతికి అతని పిలుపు వినిపించింది. పలకాలని అనిపించలేదు. ఉదయం నుండి మనిషి కోపంగా ఉంది. కోపం తారస్థాయికి చేరుకున్నప్పుడు వెనకా ముందూ చూసుకోదు. ఏ పని చేయడానికి వెనకాడదు.

బాలరాజు మరోసారి పిలిచాడు.

"వస్తున్నా" అంది.

రాదని అతనికి తెలుసు. ఆన్సరింగ్ మెషీను నొక్కాడు. మాటలు వినబడుతున్నాయి. "బాలరాజుగారూ, మీతో ఈ సంగతి చెప్పడానికి నాకు బాధగా ఉంది. నన్ను తప్పు పట్టకండి. నా ప్రయత్నం నేను చేశాను. మీ ఇంటి విషయంలో కోర్టు ఇవాళ తీర్పు ఇచ్చింది. కేసు పోయింది. బేంకు విషయంలో కూడా మనం ఓడిపోయేట్టు ఉన్నాం. మీరు వెంటనే నా దగ్గరకు వస్తే ఏం చేయాలో చెబుతాను". లాయరు ఇచ్చిన సమాచారం అది.

రెండో మెసేజ్‌లో ముందు చక్కటి నవ్వు వినిపించింది. ఇంటికి ఫోను చేయవద్దని మంజరికి ఎన్నోసార్లు చెప్పాడు. వినదు. మునుపు చేసేది కాదు. ఇప్పుడు కావాలనే చేస్తోంది. "మంజరిని, ఎన్నిసార్లు ఫోను చేయాలమ్మా? ఒకసారి నీ కాలర్ ఐ.డి. చూసుకో. నీకే తెలుస్తుంది. నీ సెల్ ఏమయింది? చంపేశావా? ఇంత అయ్యాక నాకు దూరమయిపోదామంటే వీలవుతుందేమిటి? విను. అయాం ప్రెగ్నెంట్. ఫోను చేయి. వీలుంటే వెంటనే మా ఇంటికి వచ్చేయి. వస్తూ బుట్టెడు పళ్లు, రెండు కిలోల మిఠాయి పట్టుకురా. మర్చిపోకు".

గొంతులో తడి ఆరిపోతోంది. తలపట్టుకున్నాడు. జరగకూడనివి కచ్చ గట్టినట్టు ఒక్కొక్కటిగా దూసుకువస్తున్నాయి. తన చేతులారా చేసుకున్నావే. సోఫా దిగి మంచి నీళ్లు తాగేందుకు కదలబోతోంటే, ఫోను మోగింది. అందుకున్నాడు. "హలో" అని అనబోతోంటే అవతల వ్యక్తి మాట్లాడడం మొదలెట్టాడు. "వసుమతిగారూ, నేను లాయరు నారాయణను. మీరు విడాకుల కోసం పెట్టిన అర్జీ గురించి జడ్జిగారితో మాట్లాడాను. ఆయన ముందు మీతో ఒకసారి మాట్లాడతానన్నాడు. రేపు రెండింటికి

మీరు రావడానికి వీలవుతుందా? బాలరాజు గారిని తర్వాత పిలుస్తారనుకుంటాను" తొందరలో ఉన్నట్టున్నాడు, ఎవరితో మాట్లాడుతున్నాడో తెలుసుకోవాలనిపించి ఉండదు. అవతలి వయిపు నుండి ఫోను పెట్టేసిన చప్పుడు వినిపించాక బాలరాజు ఫోను పెట్టేశాడు.

డైనింగ్ టేబుల్ మీదున్న గ్లాసు అందుకుని జగ్గులోంచి నీళ్లు ఒంపుకుని తాగాడు. గ్లాసు బల్ల మీద పెడుతూ తలెత్తి చూశాడు. బల్లకు అవతల వసుమతి నిలబడి ఉంది. ఆమె కుడిచేతిలో రివాల్వరు ఉంది. ఆమె గురి తప్పదని అతనికి తెలుసు.

"మంజరి ఎవరు?" నెమ్మదిగా అడిగింది. మాటలో కోపం లేదు.

"నాతో పాటు చదువుకుంది".

"ఈ మోసపు బతుకు ఎందుకు? నాలా ఎంత మందిని పీక్కుతింటావు?"

"మా ఇద్దరి మధ్య అంత చనువు లేదు. ప్రాక్టికల్ జోక్ అయి ఉంటుంది" మాటలు ముగించాడో లేదో తూటా అతని తలలోంచి దూసుకుపోయింది. వసుమతి కళ్లల్లోకి చూస్తూ సోఫా వెనక పడిపోయాడు. ఆమె అడిగి ఉంటే మంజరి గురించి మరిన్ని వివరాలు చెప్పి ఉండేవాడేమో. మరో తూటా అతని గుండెకు గురి చూసి పేల్చిన తర్వాత కూడా ఆమెకు కోపం తగ్గలేదు. కదులుతున్న ప్రాణం రెండో తూటాకు ఆగిపోయింది.

సోఫాలో కూర్చుని చీర కొంగుతో ముఖం తుడుచుకుంటూ 'తనిప్పుడేం చేయాలి?' ప్రశ్నించుకుంది. జవాబు దొరకలేదు. ప్రశ్నల వెనక ప్రశ్నలు ఉత్పన్నం కాసాగాయి. 'భర్తను అనవసరంగా చంపానా?' అనుకుంది. భయం కమ్ముకోసాగింది. అయిదు నిమిషాల పాటు అలా కూర్చుందో లేదో తలుపు దగ్గర ఎవరో వస్తున్న చప్పుడయ్యేసరికి రివాల్వర్‌ను చీర కొంగుతో కప్పింది.

సత్తిరెడ్డి సూట్‌కేసుతో లోపలికి వచ్చాడు. మునుపు అతను ఇంట్లోకి వస్తూనే వసుమతికి నమస్కారం చేసేవాడు. ఇప్పుడు చేయడం లేదు. మాటల్లో కూడా మన్నన లేదు.

తన ఎదురుగా ఉన్న సోఫా చూపించి, "కూర్చో" అంది వసుమతి.

కూర్చుని, "బాలరాజు ఏడి?" అడిగాడు. వసుమతి కూర్చున్న సోఫా వెనక పడి ఉన్న బాలరాజు అతనికి కనబడే అవకాశం లేదు.

"ఎందుకు?"

"అయిదెకరాలు అమ్మితే అరవయి లక్షలు వచ్చాయి. పది నేనుంచుకొని యాభయి మీకిద్దామని తీసుకు వచ్చాను" అని సూట్‌కేసు ఆమె ముందుకు నెట్టాడు.

" అరవయి లక్షలు. చాలా చవగ్గా అమ్మేశారు".

"బూం లేదు. ఆగే కొద్దీ ఇంకా తగ్గుతుంది. ఇంత కూడా రాదు."

"నిన్ను నమ్ముకుని చాలా నష్టపోయాం"

"నీతో నాకెందుకమ్మా? బాలరాజు ఏడి?"

"లేడు. చనిపోయాడు".

నమ్మలేనట్టు తల అడ్డంగా ఆడిస్తూ, "ఎప్పుడు?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"నువ్వు వచ్చేముందే. నీకు మేం ఏం తక్కువ చేశామని మాకింతలా ద్రోహం చేవావు? ఒక్కచోట కాకపోయినా ఒక్క చోటయినా... ఛీ...పూర్తిగా నాశనం చేశావు. ఎందుకురా ఇలా చేశావు?" నెమ్మదిగా అడిగింది.

సత్తిరెడ్డికి ఏమని చెప్పాలో అర్థం కావడం లేదు. వెన్నులో బయల్దేరిన భయం నరనరానికీ పాకుతోంది. తను చావుకు దగ్గరగా కూర్చున్నట్టు అనిపించింది. లేచి నుంచోబోయాడు. "కూర్చో. కూర్చో. నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు" మాటలు కఠినంగా ఉన్నాయి. అతను అంత కంటే భయంకరమయిన పరిస్థితుల్లోంచి నాలుగయిదుసార్లు బయట పడ్డాడు. ఎగిరి ఆమె మీదకు దూకబోయేంతలో రివాల్వరు రెండుసార్లు పేలింది. సత్తిరెడ్డి గది మధ్యలో కుప్ప కూలిపోయాడు. రక్తం మడుగు కడుతోంది.

నేలమీద పడున్న సత్తిరెడ్డిని చూస్తూ వసుమతి అలానే కొద్దిసేపు కూర్చుంది. అతను తన మీదకు వస్తున్నప్పుడు భయపడింది. ఇప్పుడేం లేదు. వేగంగా కొట్టుకుంటున్న గుండె మెల్లగా కుదుటపడ సాగింది. సత్తిరెడ్డి రావడం మంచిదయింది. పోలీసులు తనను ప్రశ్నిస్తే సత్తిరెడ్డి తన భర్తను కాల్చి చంపాక ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పవచ్చు. చంపడానికి కారణాలు ఉన్నాయి. ఎన్నో చూపొచ్చు. తన సమస్య తేలికగా పరిష్కారమవ్వబోతున్నందుకు సంతోషం వేసింది. ఎంతో బలం

వచ్చినట్టనిపించింది. లేచి, సూట్‌కేసు అందుకుని తెరిచి చూసింది. కట్టకట్టిన వెయ్యి రూపాయల నోట్లు సూట్‌కేసు నిండా ఉన్నాయి. సూట్‌కేసు ఎత్తి సోఫా మీద పెట్టి ముందుకు వంగి సత్తిరెడ్డి ముఖంలోకి చూసింది. కదలడం లేదు. ప్రాణం పోయినట్టంది అనుకుని చీరకొంగుతో రివాల్వరు తుడిచి అతని కుడి చేతిలో పెట్టి నుంచోబోయేంతలో తూటా ఆమె గుండెలోకి దూసుకుపోయింది. చనిపోతూ సత్తిరెడ్డి గురి తప్పలేదు.

ఆ సాయంత్రం పని మనిషి వచ్చి చూశాక గాని ఈ ఉదంతం బయటపడలేదు.

❀ ❀ ❀

ముగ్గురూ చచ్చి బతికిపోవడం వలన ఏ కార్పొరేట్ ఆస్పత్రిమీదో నెపం పడలేదు. ఏ ఒక్కరు బతికినా చేస్తే నిజం బయటకు వచ్చి ఉండేది కాదు.

"అన్నా, నా దొక్కా అనుమానమే".

"చెప్పరాదే?"

"అంత డబ్బున్న సూట్‌కేసు ఏమయిందేం?"

హెడ్డు వెంటనే జవాబు చెప్పలేదు. మెల్లగా జేబు లోంచి ఖరీదయిన సిగరెట్ పేకెట్ బయటకు తీసి, టోపీ తీసి పక్కన పెట్టి, పేకట్ లోంచి పుర్రె, ఎముకలు గుర్తున్న బీడీ తీసి వెలిగించి, గుండెల నిండా పొగ పీల్చి వదులుతూ అన్నాడు, "ఏందనుకుంటున్నావో, ఏమో? మాది పోలీసు స్టేషనా, మజాకా?"

**ఆదివారం సాక్షి, ఫన్‌డే 10 మే 2009**